ప్రజాశక్తి
శనివారం 5 ఆగస్టు 2023 5 అనంతపురం



రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రమీళ

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర నాటక అకాడమీ నూతన చైర్‌పర్సన్‌గా మండల పరిధిలోని బండమీదపల్లికి చెందిన ప్రమీళ నియామకమయ్యారు. ఈమేరకు శుక్రవారం బండమీదపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ క్లినిక్‌ను సాంబశివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నెపాకుల వీరాంజనేయులు భార్య చిన్న హనుమన్న ప్రమీళను రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం అన్నారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డితోపాటు సింగిల్‌విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి, పలువురు వైసిపి నాయకులు ప్రమీళను అభినందించారు.

పేదోళ్ల పెద్ద మనసు..!

◆ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానం
◆ వివిధ ప్రాంతాలకు తరలించిన వైద్య బృందం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రెక్కడితేగాని డొక్కాడని పేద కుటుంబాలవి... అయితేనేమి మానవత్వంలో పెద్ద మనసు తమకుందని చాటుకున్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలను దానం చేసి తమ కుటుంబ సభ్యుడు చనిపోయినా మరో నలుగురికి జీవితాన్ని అందించిన వారమవుతామంటూ ఆ యువకుడి శరీర భాగాలను దానం చేశారు. మరణించిన తర్వాత కూడా ఆయన శరీరం నలుగురికి ఊపిరిపోసింది. బ్రెయిన్‌డెడ్‌తో ఆయన చనిపోయినా అవయవదానంతో జీవించాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, బ్రెయిన్ డెత్ స్థితికి చేరుకున్న ఓ మేస్త్రి కుటుంబం చూపిన పెద్ద మనసు నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ ఘటన శుక్రవారం నాడు అనంతపురం నగరంలో చోటు చేసుకుంది.

బ్రెయిన్‌డెడ్ అయిన జగదీశ్ అవయవాలు దానం

బుక్కరాయసముద్రానికి చెందిన జగదీశ్(30)అనే యువకుడు తాపిమేస్త్రీ పని చేసుకుని జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తాపిమేస్త్రి పని చేయడం ద్వారానే కుటుంబ జీవాన్ని సాగించే వాడు. ఆగస్టు 1వ తేదీన కూడా ఈ పనికి వెళ్లి వస్తున్న సమయంలోనే అనంతపురం రూరల్ పరిధిలోని తడకలేరు వద్ద బైకు అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్రమైన గాయమైంది. తలలో తీవ్రమైన రక్తస్రావం కావడంతో బ్రెయిన్‌డెడ్ అయింది. జగదీశ్‌ను కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు మొదట ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు.


మృతి చెందిన జగదీష్(ఫైల్ ఫోటో)

అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సవేరా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన్ను కాపాడేందుకు వైద్యులు అన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేదని తేలింది. బ్రెయిన్ డెడ్ అయిన కోలుకోలేని పరిస్థితి రావడంతో జీవన్‌దాన్ కింద అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు.

గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు

కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించడంతో జగదీశ్ శరీరం నుంచి మూత్రపిండాలు, ఊపరితిత్తులు, కాలేయాలను సేకరించి ఇతరులకు అమర్చేందుకు సవేరా వైద్యులు ఉపక్రమించారు. మూత్రపిండాలు రెండింటిలో ఒకటి సవేరా ఆసుపత్రిలోనే ఆరోగ్యశ్రీ కింద ఒకరికి అమర్చారు. మరోకటి కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. కాలేయాన్ని విశాఖపట్నానికి, ఊపరితిత్తులను హైదరాబాద్‌కు తరలించారు. ఈ అవయవాలను గ్రీన్‌ఛానల్ ద్వారా అంటే ప్రత్యేకమైన అంబులెన్స్‌ల్లో కర్నూలు విమానాశ్రాయనికి తీసుకెళ్లి అక్కడి నుంచి వైజాగ్, హైదరాబాద్‌కు తరలించారు. ఇలా ఒక వ్యక్తి అవయవాలను నలుగురికి అమర్చేందుకు వీలుపడింది.


గ్రీన్‌చానెల్ ద్వారా అవయవాలు తరలిస్తున్న సవేరా వైద్యులు

నాలుగోసారి తమ ఆసుపత్రి నుంచి ఇచ్చాం

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవాదనం సవేరా ఆసుపత్రి నుంచి చేయడం ఇది నాలుగోసారి. జీవన్‌దాన్ కింద రిజిస్టర్డ్ అయిన ఆసుపత్రులు, అదే రకంగా రిజిస్టర్డు రోగులకు ఈ రకంగా బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను మరొకరికి అమర్చడం జరుగుతుంది.

హబీబ్ రాజా, మెడికల్ సూపరింటెండ్ సవేరా.

ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతోనే

జగదీశ్‌ను రక్షించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశాం. కాని ఫలితం లేకపోయింది. బ్రెయిన్‌డెడ్ కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు అవయవాలను సేకరించి మరొకరికి అమర్చేందుకు వేరువేరు ప్రాంతాలకు పంపించాం.

చంద్రశేఖర్, వైద్యులు సవేరా .

మరికొందరికైనా ఉపయోగపడాలనే ఈ నిర్ణయం : జగదీశ్ కుటుంబ సభ్యులు

జగదీశ్‌ను రక్షించేందుకు వైద్యులు అన్ని రకాల ప్రయత్నాలూ చేశారు. కాని ఫలితం కనిపించలేదు. బ్రెయిన్‌డెడ్ అయినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలోనే వైద్యులు, ఇతర అవయవదానం చేస్తే కొంత మందికైన జీవం పోయవచ్చునని చెప్పడంతో తమ కుటుంబ సభ్యులం అందరం చర్చించుకుని అవయవదానికి అంగీకరించాం. మా వాడి వలన మరో నలుగురి ఆరోగ్యాలు బాగుపడతాయన్న ఉద్ధేశ్యంతో దీనికి అంగీకరించాం.

పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల పోరుబాట

◆ బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారంపై పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు పోరుబాట పట్టారు. శుక్రవారం ఉదయం కార్మికులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. సిఐటియు, పంచాయతీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు సంగమేష్ సర్కిల్ నుంచి సిఐటియు నాయకులు, కార్మికులు ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కరోనా కాలంలో కార్మికులను దేవళ్లని, కరుణామయులని కొనియాడిన ప్రభుత్వం పెద్దలు నేడు వారి గోడు పట్టించుకునే స్థితిలో లేకుండా పోయారని విమర్శించారు. కార్మికులు వెట్టి చాకిరి చేయించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇచ్చే అరకొర వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకుండా కార్మికులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. గ్రామాలు, నగరాలు పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్న కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. తక్షణమే బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులందరికీ 11వ (పిఆర్‌సి) ప్రకారం కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. నాలుగు, ఐదు, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పోస్ట్ శాంక్షన్లు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలు ప్రకారం కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు బట్టలు, పనిముట్లు, చెప్పులు, కొబ్బరి నూనె, లాంటివి ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టరేట్ లోపలికి అధికారులను కలిసి విన్నవించేందుకు నాయకులు కార్యకర్తలు వెళ్లారు. గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైటాయించి నిరసన తెలిపారు. పోలీసులు డిపిఒ ప్రభాకర్‌రావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నాయకులతో మాట్లాడారు. 8వ తేదీన జేఏసీ సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు, కార్మికులు ఆందోళన విరమించారు. కార్మికుల ధర్నాకు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, హమాలి యూనియన్ నాయకులు రామాంజనేయులు, సిఐటియు నగర 1వ కమిటీ కార్యదర్శి వెంకట నారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్టీఆర్ శ్రీనివాసులు, తాడపత్రి సిఐటియు నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, రాప్తాడు సిఐటియు నాయకులు పోతులయ్య మద్ధతుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు భాష, బాలాజీ నాయక్, మధు, రాజు, నాగభూషణ, చంద్రశేఖర్, కుల్లాయమ్మ, ప్రభుదాసమ్మ, తిప్పారెడ్డి, నాగేంద్ర, నారాయణస్వామి, గంగన్న, నారాయణ, అబ్దుల్లా, కేశవులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

రైతు భరోసా కేంద్రాలతో మెరుగైన సేవలు

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజాతో కలిసి మండలంలోని చిన్నముష్టూర్, విడపనకల్లు మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులతో మాట్లాడి ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వివిధ రకాల పంటలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని సిబ్బంది సూచించారు. వర్షాభావ పరిస్థితులను బట్టి ఇప్పటి వరకూ డివిజన్ పరిధిలో ఎంతమేరకు సాగైందో వివరాలు తెలుసుకుని మిగిలిన భూముల్లో ప్రత్యామ్నాయంగా సాగు చేయాల్సిన విత్తన సాగు గురించి వివరించారు. పిఎం కిసాన్ పరిధిలో వందశాతం ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. ఎంపిసిఐ లింకు చేయించుకుని రైతులు ఎవరైనా ఉంటే రెండురోజుల్లోగా లింక్ చేయించేలా చూడాలని సూచించారు. అర్హులైన కౌలు రైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు అందేలా చూడాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం వేల్పుమడుగులో రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఎరువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్ మండల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య, గ్రామ వ్యవసాయ అధికారులు భీమేష్, కుళ్లాయినాయక్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


ఎరువులు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ


డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులపై మానసిక వేధింపులు ఆపాలి

డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేస్తున్న ప్రవీణ్‌ప్రకాష్ విషయంలో ప్రభుత్వం కట్టడి చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, మానసిక ఒత్తిళ్లు ఆపాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఇన్స్టెక్షన్ పేరుతో కేవలం వాట్సప్ కాల్ ద్వారా మాత్రమే ఉపాధ్యాయులు పని చేయడం లేదని, విద్యార్థుల నోట్ బుక్స్ దిద్దడం లేదని నిందలు మోపుతూ అమరావతికి పుస్తకాలు తీసుకుని వచ్చి సంజాయిషీ కోరడం అన్యాయంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి లోనై అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం కలగజేసుకొని ప్రవీణ్‌ప్రకాష్ కట్టడి చేయకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ 2023 జూన్‌లో బదిలీ పొంది కొత్త పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులకు రెండు నెలలు గడిచినా చాలా మందికి ఇంతవరకు జీతాలు అందక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ రెండు రోజుల్లో జీతాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించి జీతాలు ఇవ్వకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సహ అధ్యక్షులు ఆర్.రామప్ప చౌదరి, సరళ, జిల్లా కార్యదర్శి ఎన్.హనుమంతురెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవును నేను 'తోపు'నే..!

రూ.20 కోట్లు ఇస్తే మిగతా ఆస్తంతా రాసిచ్చేస్తా...
బాండ్‌పేపర్‌పై సంతకం చేసి విడుదల
రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం


విలేకరులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

'అవును నేను తోపునే... మీ హయంలో చేయలేని పనులను నేను చేసి చూపించాను.' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు రెండు వేల కోట్లు ఆస్తులున్నాయని చంద్రబాబు నాయుడు ఆరోపించడాన్ని తప్పుబట్టారు. తనకు రూ.20 కోట్లు డబ్బులిస్తే తక్కిన రూ.1980 కోట్లు వారికి రాసిచ్చేస్తాను అను రిజిస్ట్రేషన్ బాండ్ పేపరుపై సంతకాలు చేశారు. దీన్ని వారికి అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రాజెక్టులపై చంద్రబాబు నాడు పర్యటన అనంతరం ఆయన స్పందించారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల్లో దోచుకున్నది చంద్రబాబునాయుడు అని ఆరోపించారు. హంద్రీనీవా రెండో విడతలో 3, 4,5 ప్యాకేజీ మిగులు పనులు రూ.100 కోట్లు ఉంటే రూ.600 కోట్లకు అంచనాలు పెంచి దోచుకున్నారని మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.20 వేల కోట్ల పనులను రూ.60 వేల కోట్లకు అంచనాలు పెంచి దోచుకున్నారన్నారు. పేరూరు పెన్నా నది నుంచి నీరు తీసుకురావచ్చునని చెప్పినా పట్టించుకోలేదన్నారు. తాము అధికారంలోకి వస్తూనే అదే రకంగా ఇచ్చి చూపించామని చెప్పారు. సహకార అమ్మ డెయిరీని ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టామని వివరించారు. పేదలకు చదరపు అడుగు రూ.800 చొప్పున ఇళ్ల నిర్మాణాలను చేపట్టి ఇస్తున్నామని తెలిపారు. మీ హయంలో రెండు వేల వరకు తీసుకున్నారని విమర్శించారు. ఇవన్నీ చేసిన తోపును తానేని చెప్పారు. రెండు వేల కోట్లు దోచుకున్నట్టు చంద్రబాబునాయుడు ఆరోపించారని గుర్తు చేశారు. రూ.20 కోట్లు ఇచ్చి ఆ ఆస్తులన్నీ మీరే తీసుకోవచ్చునని సవాల్ విసిరారు. రహదారు వెంట భూములున్నది తమకు కాదని, పరిటాల సునీతకేనని చెప్పారు. దొంగదెబ్బతీయాలంటూ టిడిపి నేతలను పరోక్షంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఫ్యాక్షన్ బాధిత కుటుంబాల పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టులో చదివించి వారిని ఫ్యాక్షనిస్టులుగా మారుస్తున్నారని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత వారికి లేదని చెప్పారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయంలోనే ఈ ప్రాజెక్టుల రూపకల్పన, పనులు సాగాయన్నారు. జీడిపల్లి తాను పూర్తి చేసినట్టు చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు అధికారంలోకి వచ్చే నాటికే నాలుగుసార్లు జీడిపల్లికి నీరిచ్చియున్నారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడుకు వయసుతోపాటు బుద్ధి మందగించిందని మండిపడ్డారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకావమే లేదని విమర్శించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం

గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

గిరిజన గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వజ్రకరూరు మండల పరిధిలోని రాగులపాడులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో మౌలిక వసతులతోపాటు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి మెరుగైన బోధన అందిస్తున్నారా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ సక్రమంగా చదువుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కేటాయించిన విధంగా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌తో రికార్డులను తనిఖీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : విప్ కాపు

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సిఎం జగన్ లక్ష్యమని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లకెర గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ఎంత లబ్ధి పొందారు.. ఇప్పుడు ఎంత మంది లబ్ధి పొందుతున్నారో.. బేరీజు వేసుకుంటే తెలుస్తుందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో కూడా మరోసారి సిఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ నరసింహమూర్తి, ఎంపిపి భవాని, జడ్పిటిసి మహేష్, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామకృష్ణారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, రాజేందర్‌రెడ్డి, బిటిపి గోవిందు, నాగిరెడ్డి, పల్లకిరెడ్డి, వీరభద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోల్డ్ ఘని, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

వరదాయపల్లిలో తాగునీటి తిప్పలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సాధారణంగా వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తుతాయి.. అయితే వర్షాకాలంలో కూడా మండలంలోని వరదాయపల్లిలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా వర్షాకాలంలో సైతం గుక్కెడు నీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నా ఉప్పు నీరు సరఫరా అవుతుండటంతో పశువులు సైతం తాగలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక గ్రామానికి ఆనుకుని ఉన్న వంకలో నిల్వ నీటిని తెచ్చుకుని తాగుతున్నామన్నారు. ఈ నీటి కోసం కూడా దాదాపు కిలోమీటర్ దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు తాగునీటి సౌకర్యం కల్పించాలని వరదాయపల్లె వాసులు కోరుతున్నారు.


వరదాయపల్లిలో వంక నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న మహిళలు

ఆరోగ్య పరిరక్షణకు విద్యార్థుల్లో చైతన్యం రావాలి

జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యం పరిరక్షణలో చైతన్యం పొందాలని జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన పిలుపునిచ్చారు. శుక్రవారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భైరవనగర్‌లోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, పోషక ఆహార విలువలు, విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదలకు కావాల్సిన విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు, పోషక ఆహార విలువలను మన దైనందిత జీవితంలో అలవర్చుకుని, క్రమ శిక్షణతో ఉండాలని వివరించారు. విద్యార్థి దశలో ఇవి చాలా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం సంస్థ కన్వీనర్ ఎజి.రాజమోహన్, ఎంఎన్‌టి.రాజు, పాఠశాల యాజమాన్యం వీరనారప్ప, కొండా రెడ్డి, అంజన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వాసంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ విద్య సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

అందరికీ అందుబాటులోకి విద్య తీసుకురావాలన్నదే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ అందుబాటులో విద్య కల్పించాలనే సిఎం జగన్ అనేక పథకాలను తీసుకొచ్చారన్నారు. గ్రామ, గ్రామానికీ విద్యను చేర్చేందుకే ఓపెన్ స్కూల్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. సూర్య హైస్కూల్ కోఆర్డినేటర్ డి.బాబయ్య మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈనెల చివరి వరకూ గడువు ఉందన్నారు. వివిధ కారణాల రీత్యా చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్యనందించడమే ఓపెన్ స్కూల్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి పూర్తి చేసినవారు రెగ్యులర్ ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సుల్లో చేరవచ్చున్నారు. మరిన్ని వివరాలకు సెల్..98662 98833, 70137 61313 నెంబర్లను సంప్రదించాలని కోరారు.


సార్వత్రిక విద్యాపీఠం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి వార్తకు స్పందన

మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై విచారణ

ప్రజాశక్తి-శెట్టూరు

మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై డిప్యూటీ డిఇఒ పద్మప్రియ శుక్రవారం విచారణ చేపట్టారు. గురువారం ప్రజాశక్తి దినపత్రికలో 'సమయానికి అందని మధ్యాహ్న భోజనం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన డిప్యూటీ డిఇఒ శుక్రవారం పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడితోపాటు భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఆరాతీశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాజీ పడొద్దని సూచించారు. ఘటనపై విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ పద్మప్రియ

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఉన్న బెతస్తా ప్రయివేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఇందులో భాగంగా జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి టవర్‌క్లాక్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మధుప్రసాద్, జివిఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే.పురుషోత్తం, డిజిహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోపాల్, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టబడి సురేష్‌బాబు, ఎఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి చిరంజీవి, ఎంఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, బిజెవైఎం రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్, ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు భీమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్, ఎంఎంఎస్ మండల అధ్యక్షులు ధనంజయ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


బంద్‌ను పర్యవేక్షిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE:ANANTHAPURAMU
(in the matter of appointment of guardian and for permission to sell the property of the father of Allapa Reddy Teje Darshini aged 4 years who being minor)
G.W.O.P.No: 52/2023

Between:
Allapa Reddy Archana W/o Allapa Reddy Prathap Reddy R/at Thimmampeta Village , Garladinne Mandal, Ananthapuramu Dist. **...petitioner**
And
Nil (To Whom So ever) **...Respondents**

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు కేసులో మైనరు అయిన అల్లపరెడ్డి తేజ దర్శినికు సంబంధించిన ఆస్తిని అమ్ముటకు పై కోర్టులో అర్జీదారురాలు అర్జీ దాఖలు చేసియున్నారు. సదరి కేసు 21/08/2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైన ఆక్షేపణలున్న యెడల స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానింతురని తెలుపడమైనది.

SCHEDULE

Situated in Garladinne Village Fields, Garladinne Panchayathi area in sy.No:162, 162-2B1, 162-2B3, and an extent 9.33 A.C.Paiki 0.77, A.C, H.S.0.311, Bounded by: East:NH44 and others Land, West:Same Sy.Number others Land, North:Road, others Land South:Road others Land in between Seventy Seven Cents only aut of 1/2 Share A.C:0.38.5 Cents aut of A.C.0.77 Cents

K.VISWANATHA REDDY, ADVOCATE,
ANANTHAPURAMU CELL:9440351523

In the court of the MACT Prl. District Judge, Ananthapuramu
M.V.O.P. 237/2022

Between :
Yeddula Gouri and another **...petitioner**
And
Jagadish Kumar Sood and others **...Respondents**

Notice to Respondent No:1

R1: Jagadish Kumar Sood S/o S.H.Banarsi Dass Sood, Residing at CW-93, Sanjay Gandhi Transport Nagar, North -West Delhi.(Owner of offending Lorry bearing Regn.No: DL01-GC-5982)

Where as the petitioner has filed a claim petition against you and the same is posted to 16-08-2023 for your appearance. you are hereby directed to appear before the hon'ble court either in person or through an advocate duly instructed on 16-08-2023 at 10:30 A.M. failing which the matter will be heard and decided exparte.

(By order of the court)
B.V.Seshadri, K.N.Ramanjineyulu,
Advocates, Ananthapuramu, Cell: 8639377609

In the court of the IIIrd Addl. Junior Civil Judge, (Excise court) Ananthapuramu
O.S. No:894/2022

Between :
Canara bank (Rep by its anthorised office, Manager and anthorised officer,New Town, Ananthapuramu **...Plaintiff**
And
M.Prashanth **...Defendent**

Notice to Defendent

To
M.Prashanth S/o M.Venkatesh, R/at D.No:1-3-407, Rangaswamy Nagar, Ananthapuramu

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 21-08-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
చిలమకూరి శ్రీనివాసులు,
వాదిపరం వకీలు, అనంతపురం సెల్:9490122008

అసత్య ఆరోపణలు తగదు

సివిఆర్‌టి కళాశాల ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి



సివి రామన్ ఇంజినీరింగ్ కళాశాలపై సంబంధం లేని ఆరోపణలు చేస్తూ బురదల్లే కార్యక్రమాలు చేయడం సరైన పద్ధతి కాదని సివిఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత భాస్కర్‌రెడ్డి హితవు పలికారు. శుక్రవారం స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా తమ కళాశాలపై అడ్మిషన్ల సమయంలో పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. ఈ విధానం సరైన పద్ధతి కాదన్నారు. ఎవరైనా తమ కళాశాలలు అభివృద్ధి చెందాలంటే తగిన వనరులు ఏర్పాటు చేసుకోవాలేగానీ, ఇతర కళాశాలలపై అవాస్తవాలు మాట్లాడి బురదజల్లడం మంచిది కాదన్నారు.

కళ్యాణదుర్గం ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం : అసైన్డ్ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడుతున్న ఆర్‌డిఒ నిషాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అర్హులైన అసైన్డ్ భూమి సాగుదారులను గుర్తించే క్రమంలో ఆర్‌డిఒ అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పైరవీదారులు, తన అనుచరులు, మధ్యవర్తులకు అసైన్డ్ భూములు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. వెంటనే ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఆర్‌కె.రాజు, తిప్పేస్వామినాయక్, గురుస్వామి, చెలిమప్ప, గోవిందప్ప, గంగాధర, నారాయపురం ఎంపిటిసి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో స్థానికులు ఖాళీ బిందెలతో శుక్రవారం పట్టణంలోని ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. ముందుగా టిడిపి కార్యాలయం నుంచి ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వరకూ ఖాళీ బిందెలతో ర్యాలీగా ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 20 రోజుల నుంచి పట్టణంలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ఏళ్ల తరబడి ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేయకుండా నీరు సరఫరా చేయడంతో కలుషితమైన నీరు తాగిన ప్రజలు విషజ్వరాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ అంజుమన్ సుప్రిన్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, మాజీ ఎంపిపి సంకరత్నమ్మ, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ దేవినేని పురుషోత్తం, వార్డు సభ్యులు రామాంజనేయులు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వరప్రసాద్, టిడిపి నాయకులు గోవిందు, సుధాకర్, తిమ్మప్ప, వేణు, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముట్టడి


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

ముర్రుపాలే బిడ్డకు అమృతం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

తల్లి ముర్రుపాలే బిడ్డకు అమృతం అని తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ సంపూర్ణ పోషకాహారం పంపిణీ చేయడం ద్వారా ప్రతి తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : పుట్టిన పిల్లలకు తల్లిముర్రు పాలు పట్టించడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మండల వైద్యాధికారిణి డాక్టర్ షమీంతాజ్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్లూరు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విశ్వనాథరావు, సిహెచ్ఒ సుమలత, ఆరోగ్య కార్యకర్తలు భాగ్యమ్మ, ఆంజనేయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మకూరులో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు : రాష్ట్రంలో తల్లీబిడ్డ సంరక్షణే లక్ష్యంగా సిఎం జగన్ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకానికి శ్రీకారం చుట్టారని గోరిదిండ్ల సర్పంచి నాగరత్నమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గోరిదిండ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పోషకలోపం లేని పిల్లలు, తల్లులని తయారు చేయాలన్నదే పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరసింహులు, మహిళా పోలీస్ శాంతికుమారి, అంగన్‌వాడీ అలివేలమ్మ, ఆయా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇళ్ల నిర్మాణాలను వందశాతం వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, హౌసింగ్ డిఇ హనుమన్న సూచించారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో గృహ నిర్మాణానికి సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే గృహ ప్రవేశాల్లో ఎక్కువ మంది గృహప్రవేశాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే బిల్లులు విషయంలో కూడా అలసత్వం చేయకుండా వెంటనే లాగిన్లలో అప్రూవల్ ఇచ్చి, బిల్లులు త్వరగా పడే విధంగా చూడాలని తెలిపారు. మండల వ్యాప్తంగా 1800 మంజూరైతే 50 శాతం మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన శాతం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ అనిల్‌కుమార్, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, సహకార సంఘం సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు, కో-ఆప్షన్ మెంబర్ లతీఫ్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

గ్రామీణుల చెంతకే ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

అర్హులందరికీ వారి ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తరిమెల సచివాలయం, రైతుభరోసా కేంద్రం, నిదనవాడలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, సలకంచెరువులో రైతుభరోసా కేంద్రం, పెరవలిలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, బండమీదపల్లిలో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకే పాలన అందిస్తూ, అవినీతి, వివక్షతకు తావు ఇవ్వకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, వైసిపి మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, సర్పంచ్ ఎస్పీ నారాయణరెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ ఈరమ్మ, ఎంపిడిఒ నిర్మలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరూ సమానమే..

హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ

ప్రజాశక్తి-ఉరవకొండ

సమాజంలో ఆడా మగ ఇద్దరూ సమానమేనని పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ తెలిపారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం ఉరవకొండ కెజిబివి పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించుకున్నా.. ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. అలా చేస్తే జైలుశిక్ష, జరిమానా విధించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఆడ, మగ అనే తేడా లేకుండా పిల్లలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ప్రమీళ, స్టాఫ్‌నర్స్ నాగలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎం.ప్రసాద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని రాచర్ల తండాలో జిల్లా మలేరియా అధికారి డి.ఓబుల్ ఆధ్వర్యంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు స్ప్రే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సహాయ మలేరియా అధికారి కె.సత్యనారాయణ, ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారిణి శ్రీదేవి, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తిరుపాల్‌బాయి, కౌకుంట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగర సమీపంలోని అనంత క్రీడాగ్రామంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. సెమీఫైనల్ మ్యాచ్‌లో నాలుగు జట్లు తలపడగా రెండు జట్లు గెలుపొందాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన సెయింట్ విన్సెంట్ డిపాల్ స్కూల్ జట్టు నిర్ణీత 12 ఓవర్లు నాలుగు వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. ఈజట్టులో ధనుష్ 25, మోక్షిత్ 20, లిఖిత్ కుమార్ 20 పరుగులతో రాణించారు. రాజేంద్ర స్కూల్ బౌలర్లు సాబీర్ 2, హేమంత్ 1 వికెట్ తీసుకున్నారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాజేంద్ర స్కూల్ నిర్ణీత ఓవర్లకు 101 పరుగులు చేసి 9 పరుగులు తేడాతో పరాజయం పాలైంది. రాజేంద్ర స్కూల్ జట్టులో జునైద్ 40, ఫణి 18, సాయికృష్ణ 10 పరుగులతో రాణించారు. విన్సెంట్ డి పాల్ స్కూల్ బౌలర్లు లలిత్ 3 వికెట్లతో రాణించారు. దీంతో విన్సెంట్‌డిపాల్ స్కూల్ ఫైనల్‌కు చేరింది. కాగా రెండవ సెమీఫైనల్ మ్యాచ్‌లో రాధా స్కూల్, స్ఫూర్తి స్కూల్ తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన స్ఫూర్తి స్కూల్ 62 పరుగులకు ఆల్‌అవుట్ అయింది. ఈజట్టులో సతీష్ 16, ప్రభాస్ 15 పరుగులతో రాణించారు, రాధా స్కూల్ బౌలర్లు అమీర్ 4 వికెట్లు, బాల చరణ్ 3 వికెట్లు సాధించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాధా స్కూల్ 7 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ జట్టులో బృంగేశ్వర్ 35, రియాజ్ 20 పరుగులు సాధించారు. స్ఫూర్తి స్కూల్ బౌలర్ పతీష్ 2 వికెట్లు తీసుకున్నాడు. ఈ విజయంతో రాధా స్కూల్ ఫైనల్ చేరింది. ఫైనల్లో రాధా, విన్సెంట్ డిపాల్ పాఠశాలలు తలపడనున్నట్లు కోచ్‌లు ప్రవీణ్, బిందు, మధు, తదితరులు తెలిపారు.


విజయం సాధించిన క్రికెట్ జట్టుతో కోచ్‌లు

నేరాలు ఘోరాలు

ఘర్షణలో మహిళకు గాయాలు

గుత్తి : మండలంలోని కొజ్జేపల్లి గ్రామంలో గురువారం రాత్రి అన్నదమ్ములు ఘర్షణ పడడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఓబులేసు, నాగరాజు మధ్య కొంతకాలం నుంచి కుటుంబ కలహాలు ఉండేవి. ఈ నేపథ్యంలో ఇరువురు గొడవకు దిగి ఘర్షణ పడ్డారు. ఘర్షణలో నాగరాజు భార్య సులోచన తీవ్రంగా గాయపడింది. గాయపడ్డ ఆమెని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మల్బరీ షెడ్డు దగ్ధం

శెట్టూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మల్బరీ షెడ్ దగ్ధమైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు లేపాక్షి తెలిపిన వివరాల మేరకు.. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న మల్బరీ షెడ్డుకు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పూర్తిగా దగ్ధమైనట్లు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణం సీజ్

శింగనమల : మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్‌లో లైసెన్స్ లేకుండా నడుపుతున్న శ్రీలక్ష్మి ఆగ్రో ఏజెన్సీస్‌ను సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు సీజ్ చేశారు. శుక్రవారం నాయనపల్లి క్రాస్‌లో ఉన్న పురుగు మందుల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా విక్రయిస్తున్న సుమారు రూ.59,700 విలువజేసే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, గుత్తి డివిజన్ ఫర్టిలైజర్ హబ్ మేనేజర్ కృష్ణభగవాన్, తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు తొలగిస్తే ఉలుకెందుకు..?

అనంతపురం : నియోజకవర్గంలో ఆధారాలతో సహా చూపించి దొంగ ఓట్లు తొలగిస్తే ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఉలుకెందుకు అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లపై తాము ఫిర్యాదు చేస్తే విచారణ చేయకుండా పయ్యావుల కేశవ్ అధికారులను బెదిరిస్తున్నాడన్నారు. కేశవ్‌కు ధైర్యం ఉంటే దొంగ ఓట్లపై విచారణకు సహకరించాలని కోరారు.

7న మండల సమావేశం

గుత్తి : ఈనెల 7న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 17 అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలు

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో శుక్రవారం గొర్రెలకు చిటుక వ్యాధి నివారణ ఉచిత టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. కాలువపల్లి గ్రామానికి చెందిన రైతు కిష్టప్ప గొర్రె గత మంగళవారం అకస్మాత్తుగా ఎలాంటి వ్యాధి లక్షణాలు చూపించకుండా మంగళవారం మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే పశు వైద్యులు ఎ.రమేష్, నాగబాబు గ్రామానికి చేరుకుని గొర్రెల మందను పరిశీలించారు. ఇందులో భాగంగా చనిపోయిన గొర్రెకు శవ పరీక్ష చేసి చిటుక వ్యాధిగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు 600 గొర్రెలు, మేకలకు వేసినట్లు తెలిపారు. అలాగే గంగవరంలో కూడా వ్యాధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర పెద్దన్న మరియు ట్రైనింగ్ కాంపౌండర్లు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయ' విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

గార్లదిన్నె : ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలనుకునే రైతులు విత్తనాల కోసం ఈనెల 8వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కోటంక గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆగస్టు 15 నుంచి సాగు చేసే పంటలపై రైతులతో చర్చించారు. ఉలవలు, పెసలు, కొర్రలు, అలసందలు వంటి విత్తనాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేసినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి తెలిపారు. ట్రస్టు సభ్యులు, శారదా బుక్‌స్టాల్ యజమాని శివ రాజప్రసాద్ జన్మదినం సందర్భంగా కుమార్తె అనుజ్ఞ శ్రావ్యతో కలిసి అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కవీన్‌ఆదిత్య, నిర్విఘ్నసాయి, సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి మంత్రికి ఆహ్వానం

పుట్లూరు : బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద ఈనెల 5న నిర్వహించనున్న శింగనమల మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నూతన మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన భూమిరెడ్డి సునీత శుక్రవారం ఆహ్వానించారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో భూమిరెడ్డి సునీతతోపాటు నాగార్జునరెడ్డి, ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి, తదితరులు మంత్రికి కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

చంద్రబాబుపై దాడి అమానుషం

యాడికి : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుపై పుంగనూరులో వైసిపి కార్యకర్తలు రాళ్ల దాడి చేయడం అమానుషమని మండల టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ టిడిపికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసిపి నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకుడు ఎక్కడికైనా వెళ్లే అధికారం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని తెలిసి దాడులు చేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిటిసి దడియాల ఆది, బీసీ సెల్ స్పోక్స్‌పర్సన్ మధురాజు, నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

పుట్లూరు : రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైతుసంఘం నాయకులు డి.చిన్నప్పయాదవ్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని కొండాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, నియోజకవర్గ రైతుసంఘం సహాయ కార్యదర్శి గోపాల్, శేఖర్, రైతులు సుందరమూర్తి, మధుసూదన్, నాగముని, కుళ్లాయప్ప, నాయకులు కుళ్లాయప్ప, సంజీవపురం కుల్లాయప్ప, చిన్నికృష్ణుడు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖితకు సిఎం అభినందన

అనంతపురం : ఆప్కాబ్ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖితను సిఎం జగన్ అభినందించారు. అనంతపురం జిల్లాలో చిన్న వయసులో సహకార బాధ్యతలను ఎంతో బాధ్యతాయుతంగా ముందుకు నడపడంతోపాటు రైతన్నలకు చేయూతనియడం పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని అభినందించినట్లు ఛైర్‌పర్సన్ లిఖిత ప్రజాశక్తికి తెలిపారు. శుక్రవారం విజయవాడ ఎ కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు వజ్రోత్సవ వేడుకల్లో సిఎంను కలిసి సత్కరించి జ్ఞాపకం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ వీరాంజనేయులు పాల్గొన్నారు.



సిఎం జగన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, వీరాంజనేయులు